లీకుల తంటా తీరేదెన్నడు?


శ్రీరామపురం వెళ్లే రోడ్డులో పైపులైన్ లీకవుతున్న దృశ్యం


జంక్షన్ రైల్వే స్టేషన్ కు వెళ్లే రోడ్డులో పైపులైన్ లీకవడంతో పేరుపోయిన నీరు

- భీమవరం పట్టణమంతా పైప్‌లైన్ లీకేజీలతో మంచి నీరు వృథా
- అరకొర మరమ్మతులతో అవస్థలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో పైపులైన్ల లీకేజీతో శివారు ప్రాంత ప్రజలు గుక్కెడు నీటి కోసం కటకటలాడుతున్నారు. పైపు లీకేజీల వల్ల మంచినీళ్లు వృథాగా పోతున్నాయి. సమస్య పరిష్కరించాల్సిన మున్సిపల్ వాటర్ సరఫరా విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. నెలల తరబడి పైపు లీకేజీలు ఉన్నప్పటికి వాటికి మరమ్మతులు చేయకపోవడంతో ఫిల్టర్ చేసిన మంచినీరు వృథా అవుతుంది. ఎప్పుడైనా ప్రధాన సెంటర్‌లో అక్కడక్కడ ఒకటి లేదా రెండు పైపు లీకేజీలకు మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. అలాగే నాణ్యత లేకుండా పైపు లీకేజీలకు మరమ్మతులు చేయడం వల్ల చేసిన రెండు రోజులకే మళ్లీ నీరు లీకవుతుందని స్థానికులు వాపోతున్నారు.

రోజూ వేల లీటర్ల నీరు వృథా

పట్టణంలో దాదాపు 50 నుంచి 60 పైపులకు లీకేజీలు ఉన్నాయి. వాటిని నుంచి మంచినీళ్లు నిర్విరామంగా పోవడంతో రోజుకు వేల లీటర్లు వృథా అవుతున్నాయి. అయితే అక్కడక్కడ చేస్తున్న పైపు లీకేజీలకు మరమ్మతులకు సంబంధించి అధికారులు అవినీతికి పాల్పుడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పైపు లీకేజీ పనులు రోజుల తరబడి చేస్తున్నట్లు, గొయ్యిలు తవ్వి మరమ్మతులు చేయకుండా వదిలేసి, గొయ్యిలు తవ్వించామని బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని దోచేస్తున్నట్లు వాటర్ సరఫరా విభాగం అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది కాలంలో నుంచి ఈ అవినీతి వ్యవహారం జరుగుతుందని రూ.50 లక్షల వరకు లీకేజీల ద్వారా అవినీతి బిల్లులు ద్వారా దోపిడీ జరిగింది. విచారణ చేస్తే లీకేజీల బిల్లుల బాగోతం బయట పడుతుంది.

వేసవిలో చెరువుల నీళ్లే ఆధారం

వేసవిలో భీమవరం పట్టణ ప్రజల దాహం తీర్చడానికి రెండు సమ్మర్ స్టోరేజి ట్యాంకులే (చెరువులు)ఆధారం. అయితే ఇలా పైపుల లీకేజీల ద్వారా నీళ్లు పోతే వేసవిలో పట్టణ ప్రజలకు రెండు పూటల మంచినీళ్లు అందించడం కష్టం అవుతుంది. చెరువు నుంచి నీళ్లు తీసుకుని ఫిల్టర్ చేసి సరఫరా చేసే ప్రతి నీటి బొట్టు చాలా ముఖ్యం. అసలు వృథాగా చూక్క నీరు పోయిన పట్టణ ప్రజల గొంతు ఎండ ఖాయం. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి పైపు లీకేజీల మరమ్మతులు వేగంగా చేసి వృథాగాపోతున్న నీళ్లకు అడ్డుకట్ట వేస్తే మంచినీళ్ల ఇబ్బందులు తొలగుతాయని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు

భీమవరంలో పైపుల లీకేజీలు ఇలా

- శ్రీరామపురం వెళ్లే రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద
- రైల్వే జంక్షన్‌కు వెళ్లే రోడ్డులో ఓవర్ బ్రిడ్జి దగ్గర రిలయన్స్ బంకు వద్ద పీపీ రోడ్డుకు ఆనుకుని
- ఆంధ్రా బ్యాంకు చినరంగని పాలెం
- జువ్వలపాలెం రోడ్డు నటరాజ్ థియేటర్ దగ్గర
- కుముదవల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద
- బీహెచ్‌వీకే టవర్స్ వద్ద
- ఆర్టీసీ క్వార్టర్స్ వద్ద
- సెంటిమేరిస్ విద్యాసంస్థల వద్ద
- పీసీఆర్ కల్యాణ మండపం వద్ద
- బ్రౌనింగ్ కళాశాల వద్ద
- మార్కెట్ యార్డ్ వద్ద

క్లుప్తంగా

వైభవంగా పద్దాల వెంకమ్మ జాతర

వీరవాసరం: మండలంలోని నవుదూరు జంక్షన్‌లో ఉన్న శ్రీ పద్దాల వెంకమ్మ వారి జాతర మహోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. మేళతాళాలతో బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల గరగోత్సవం అత్యంత కన్నుల పండువగా చేశారు. కార్యక్రమంలో పలు సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాత పెనుమత్స సూర్యనారాయణ రాజు, పెనుమత్స రామరాజు, కలిదిండి సూరిబాబు దంపతులు పాల్గొన్నారు

ఆకివీడు అభివృద్ధికి ఆద్యుడు వీరమల్లు


రామకృష్ణారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: ఆకివీడు పంచాయతీ అభివృద్ధికి మాజీ సర్పంచ్ వీరమల్లు రామకృష్ణారావు ఆద్యుడు అని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. వీరమల్లు 98వ జయంతి సందర్భంగా దేవతిలకల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరమల్లు పాండు రంగ విఠల్ రావు అధ్యక్షతన శనివారం ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణారావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, వైస్‌చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్లు నిమ్మల నాగు, గేదల అప్పారావు, మన్నే లలితాదేవి, మోరా జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జలవనరులను కాపాడాలని, భావితరాలకు తాగునీరు ఇవ్వాలని, కాలువల్లో చెత్త వేయకూడదని, కాలువలను ప్రక్షాళన చేయాలని ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర రావు అన్నారు. భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం, కాలువలో చెత్త వేయరాదంటూ రాజులపేటలో ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యర్థ పదార్థాలు ప్లాస్టిక్ సీసాలు ఇత్యాది వస్తువులు కాలువలలో పడి వేయడం వల్ల చాలా అనర్థమని, కాలువలు ప్రక్షాళన చేయడంలో అందరూ బాధ్యులు కావాలని, కాలువలో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఐరన్-మిషనరీ మర్చంట్ అసోసియేషన్ ఎన్నిక


ఐరన్-మిషనరీ మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

భీమవరం: స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ది భీమవరం ఐరన్-మిషనరీ మర్చంట్ అసోసియేషన్ 2025-27కు గానూ నూతన కార్యవరాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తటవర్తి బదిరీ నారాయణ, గౌరవాధ్యక్షుడిగా కనుమూరి సత్యనారాయణ రాజు, ఉపాధ్యక్షుడిగా కంచర్ల భాస్కరరావు గుప్తా, మానేపల్లి వెంకన్న బాబు, కార్యదర్శి నీలి స్వామి, సహాయ కార్యదర్శి కంచర్ల కళ్యాణ్, తటవర్తి శ్రీనివాసు, కోశాధికారి గాదె వెంకట సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు పరామర్శ


తమ్మిశెట్టి అబ్బులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పీవీఎల్ నరసింహరాజు

పాలకోడేరు: గరగపర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తమ్మిశెట్టి సత్యనారాయణ(అబ్బులు) తల్లి గోపాలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే వైఎస్సార సీపీ కార్యకర్త, సొసైటీ మాజీ డైరెక్టర్ కిర్ల అప్పారావు భార్య యర్రాయమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం ఇద్దరి కుటుంబాలను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు పరామర్శించారు. అబ్బులు తల్లి గోపాలమ్మ మృతి చాలా బాధాకరమని, ఓదార్చారు, అలాగే కిర్ల అప్పారావు భార్య యర్రాయమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట చింతలపాటి బలరామరాజు, పాలా రాధాకృష్ణ, గుంటపల్లి వెంకన్న, గుండు నాగేశ్వరరావు, తోకల సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు జలాభిషేకం


దుంపగడప రైల్వే గేటు వద్ద కనకదుర్గమ్మకు జలాభిషేకం చేసేందుకు క్యూ కట్టిన మహిళలు

ఆకివీడు: స్థానిక దుంపగడప రైల్వే గేటు వద్ద ఉన్న కనక దుర్గమ్మ అమ్మవారి ఆరో వార్షికోత్సవం శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు ఇంటి వద్ద నుండి పసుపు, వేపాకు నింపిన నీళ్లను బిందెలతో తీసుకువచ్చి జలాభిషేకం, పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజ నిర్వహించారు. 30న మహా చండీ, దుర్గా సహిత రుద్ర హోమం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేకంగా హోమగుండాలు సిద్ధం చేశారు. 31న అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మావుళ్లమ్మ ఆలయంలో చండీహోమం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో శనివారం అమావాస్య సందర్భంగా చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ, వేద పండితులు హోమం నిర్వహించారు. 55 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

కోట సత్తెమ్మ ఆలయంలో

వీరవాసరం: స్థానిక కోట సత్తెమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివార్లకు చండీహోమాన్ని నిర్వహించారు. వీరవాసం గ్రామానికి చెందిన నూకల అప్పాజీ-అరుణకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయ ఆవరణలో అన్న సమారాధన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పాలకోడేరు: మండలంలోని వేండ్ర గ్రామంలో వైన్ షాప్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన కండెల్లి అశోక్(31) తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే మార్టేరు గ్రామానికి చెందిన అశోక్ పని నిమిత్తం బైక్ పై భీమవరం వెళ్తుండగా వేండ్ర వైన్ షాప్ దగ్గరలో ఎదురుగా వస్తున్న వేరొక మోటార్ సైకిలిస్ట్ బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో అశోక్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి గాయపడిన క్షతగాత్రుడిని ఆటోలో భీమవరంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్ళు కూల్చివేయడంతో నిరాశ్రయులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం బొండాడలో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలంటూ కాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద పేద ప్రజలు ధర్నా చేపట్టారు. పెద్ద ఎత్తున బాధిత కుటుంబాలకు చెందిన మహిళలు ధర్నాలో పాల్గొన్నారు. రెవిన్యూ అధికారులు వినతి పత్రాన్ని అందజేశారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చాలి

భీమవరం అర్బన్: పేదల సొంతింటి కలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామంలో ఎస్సీపేటలో ఇళ్లు లేని వారికి 3 సెంట్లు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంధి యోహాన్, బీమా ఝాన్సీ, దొడ్డి స్వామి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ ఆకస్మిక మృతిపై విచారణ చేయాలి

వీరవాసరం: పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆకస్మిక మృతిపై ప్రత్యేక విచారణ చేపట్టాలని వైయస్ఆర్సీపీ మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందర్రాజు డిమాండ్ చేశారు. వీరవాసరంలో శనివారం నిర్వహించిన క్రైస్తవ సంఘాల ప్రత్యేక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ అనుమానాస్పద మృతిని యాక్సిడెంట్ కేసుగా పరిగణించడం పలు అనుమానాలకు దారితీస్తుందన్నారు. అనంతరం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో వెంపల్ల నరసింహమూర్తి, తాడి రాజశేఖర్, గెడ్డం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ చెక్కుల అందజేత

భీమవరం: ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య అని ఎమ్మెల్యే, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో శనివారం మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 82 మంది విద్యార్థులకు రూ 7 లక్షల స్కాలర్ షిప్ చెక్కులను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కోళ్ళ నాగేశ్వరరావు, చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, పత్తి హరివర్ధన్ పాల్గొన్నారు.

ఉగాది వేడుకలు ప్రారంభం

భీమవరం: తెలుగు వారి తొలి పండుగ ఉగాది అని, తెలుగు భాషా గొప్పతనాన్ని తెలుసుకోవాలని ఎమ్మెల్యే, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఎస్ఆర్ కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏబీవీపీ (అఖిల భారత విద్యార్థి పరిషత్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది సంబరాలను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, వినోద్ వర్మ, వబిలిశెట్టి రామకృష్ణ, ఎస్ఆర్ కేఆర్ కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ జగపతిరాజు పాల్గొన్నారు.

2 నుంచి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ఉండి: చంద్రన్న స్వయం సోపానం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వచ్చే నెల 2,3 తేదీల్లో అనగా బుధ, గురువారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.రవీంద్ర తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ రుణాలకు 20 రెవెన్యూ గ్రామాల్లో 1250 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆకివీడు: అక్రమంగా తరలిస్తున్న ఏడు మద్యం సీసాల్ని ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చిన సమాచారం మేరకు ఎస్‌హెచ్‌ఓ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది ఆకస్మిక దాడి చేసి మిద్దే వినోద్‌కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద ఉన్న ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి పన్ను పెంపుదలను విరమించుకోవాలి

భీమవరం: ఏప్రిల్ నుంచి పెంపుదల చేయాలనుకొనే ఆస్తిపన్ను ఆలోచనను విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ గతంలో అద్దె విలువ ఆధారంగా ఆస్తి పన్ను వసూలు చేయాలని విలువ ప్రకారం ఆస్తి పన్ను వసూలు చేస్తే సహించమని స్పష్టం చేశారు. అలాగే ఆస్తి పన్ను బకాయిలు చెల్లించడానికి మే నెలాఖరు వరకూ గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ


ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని 30 గ్రామాల్లో 2023-24 సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నిర్వహించారు. డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో చేసిన పనుల వివరాలను చదివి వినిపించారు. ఉపాధి హామీ పథకంలో 1345 పనులు, పంచాయతీరాజ్ విభాగంలో 85 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ఒక పని మొత్తం 1431 పనులు చేసినట్లు వివరించారు. ఈ పనులకు సంబంధించి వేతనాల రూపంలో కూలీలకు రూ.4 కోట్ల 19 లక్షల 57 వేల 624, మెటీరియల్ రూపంలో రూ.4 కోట్ల 38 లక్షల 79 వేల 538 వెరసి మొత్తం రూ.8 కోట్ల 58 లక్షల 37 వేల 162 ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ పనులపై 30 గ్రామాల్లోనూ విచారణ చేసి గ్రామ సభలలో పనుల వివరాలు చదివినట్లు ఆయన చెప్పారు. ఈ మొత్తం పనుల్లో రూ.27,686 నిధులు దుర్వినియోగమయినట్లు గుర్తించి రికవరీ రాశారు. అలాగే రూ.7 వేలు ఫైన్ విధించారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీవీఓ పురుషోత్తం, అంబుడ్స్‌మెన్ ఆదినారాయణ, ఈఓఆర్డీ జేడీవి ప్రసాద్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పి ఎం గోవింద్, ఏపీఓ చక్రపాణి, టీఏ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న పాత్రికేయులు

భీమవరం (ప్రకాశంచౌక్): ఇటీవల విజయవాడలో ప్రభుత్వ కొత్త ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయునిపై ఆస్పత్రి సిబ్బంది దాడి చేయడాన్ని ఖండిస్తూ ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని జిల్లా కలెక్టరేట్లో పత్రికా విలేకరులు డీఆర్‌ఓకు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచన మేరకు పాత్రికేయులపై దాడులు చేసిన, దూషించిన వారిని కఠినంగా శిక్షించాలని కోరాఉ. కార్యక్రమంలో ఎం.విజయ్ కుమార్, ఎం.ప్రభాకర్, ఎ.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలి

నరసాపురం: పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి ఆర్ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మెప్మా సిబ్బందికి పోక్సో చట్టంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో జడ్జి వరలక్ష్మి మాట్లాడారు. 18 సంవత్సరాల్లోపు ఆడపిల్లలను వివిధ రూపాలో లైంగికంగా వేధించిన వారు పోక్సో చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని చెప్పారు. ప్రస్తుత ఇంటర్నెట్ కాలంలో బాలికలు అనేక రకాలుగా వేధింపులకు లోనవుతున్నారని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయడం, కోర్టును ఆశ్రయించడం ద్వారా న్యాయం జరుగుతుందని అన్నారు. పోక్సో చట్టంపై ముందు తల్లితండ్రులు కూడా అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి, ప్యానల్ న్యాయవాది సీహెచ్ చిట్టిపద్మజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎస్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.